సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 2 । మే । 2023



గ్రామాభివృద్ధే ముఖ్యమంత్రి ధ్యేయం
రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. - 8లో



నకిలీ ఇన్సూరెన్స్ కేసులో ఒకరి అరెస్ట్
నకిలీ ఇన్సూరెన్స్ కంపెనీల పేరుతో సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న కాల్ సెంటర్ ఏజెంట్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



మాది కార్మిక పక్షపాతి ప్రభుత్వం
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్మికుల పక్షపాతిగా పనిచేస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. మే డే సందర్భంగా పార్టీ కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. - 8లో

న్యూస్‌రీల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాధ్యతల స్వీకరణ



వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా వి. శ్రీనివాస ఆంజనేయ మూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఈయన 1995 జూన్ 1 వ తేదీన తొలి సారిగా విజయవాడ 8వ అదనపు జిల్లా న్యాయమూర్తిగా నియమితులయ్యారు. మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి కడప న్యాయవాదులతో కలిసి సమీక్ష జరుపుతారని కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.వి. రాఘవరెడ్డి ప్రధాన కార్యదర్శి కెనడీ తెలియజేశారు.

• కడప రెండవ అదనపు మెజిస్ట్రేట్‌గా కె. భార్గవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కర్నూలు కోర్టు నుంచి బదిలీపై వచ్చారు. కడప రెండవ అదనపు మెజిస్ట్రేట్‌గా పనిచేసిన షేక్ రియాజ్ కృష్ణాజిల్లా నందిగామ కోర్టుకు బదిలీ అయ్యారు.

సజ్జలతో డిప్యూటీ సీఎం, మేయర్ భేటీ



కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డితో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, కడప మేయర్ కె. సురేష్ బాబులు భేటీ అయ్యారు. సోమవారం విజయవాడలోని మంగళగిరిలో ఆయన క్యాంపు కార్యాలయంలో సజ్జల రామక్రిష్ణారెడ్డిని కలిసి కడప నగరాభివృద్ధి, జిల్లా రాజకీయాంశాల గురించి చర్చించారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమ బాబు ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖ విభాగాల్లో ఏర్పడిన ఖాళీల భర్తీకి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. దరఖాస్తు నమూనా ఇతర వివరాలకు కడప.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తును వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని, సంబంధిత సర్టిఫికెట్స్ జతపరచాలని అన్నారు ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలలోగా కడపలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో హాజరు కావాలన్నారు.

శిల్పారామాల రాష్ట్ర ఏఓగా మునిరాజు



కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ మునిరాజు శిల్పారామాల రాష్ట్ర స్థాయి పాలనాధికారిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం కడప శిల్పారామంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా సేవలు అందించిన ఆయన సుదీర్ఘ పాలన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర శిల్పారామాల సీఈఓ డి.శ్యామసుందర్‌రెడ్డి మునిరాజును శిల్పారామాల రాష్ట్ర ఏఓగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప శిల్పారామానికి కొత్త హంగులు కల్పించేందుకు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న విజయనగరం, పుట్టపర్తిలలోని శిల్పారామాలను త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

కేజీ సెట్ 2కే22 పరీక్షకు విశేష స్పందన



ఆన్‌లైన్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : కడపనగర శివార్లలోని కేఎస్ఆర్ఎం, కేఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు నిర్వహించిన కేజీసెట్ 2కే23 ఆన్‌లైన్ పరీక్షకు విశేష స్పందన లభించింది. రాయలసీమలోని వివిధ జిల్లాల నుంచి వెయ్యి మందికి గాను 967 మంది పరీక్షకు హాజరైనట్లు కళాశాల ప్రధానాచార్యులు వీఎస్ఎస్‌మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే తరహాలో మరో మూడు రోజులపాటు కేజీసెట్ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షను రాయడం వల్ల విద్యార్థులకు త్వరలో జరగబోయే ఎంసెట్ పరీక్ష పట్ల మంచి అవగాహన వస్తుందన్నారు. కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, ఎండీ కందుల చంద్ర ఓబులరెడ్డి, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, కేఎల్ఎం ప్రిన్సిపాల్ ఎంవి రత్నమ్మ, అడ్మిన్‌స్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, కేజీసెట్ కన్వీనర్ కిసోర్‌కుమార్, డీన్ అడ్మిషన్ కమిటి రామోహన్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

మనిషి ఇక్కడ మనసు అక్కడ



- బీజేపీలో ఉంటూ చంద్రబాబు భజన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆది
- బీజేపీ, జనసేన, టీడీపీ పొత్తుల వ్యాఖ్యలపై అధిష్టానం సీరియస్
- వివాదాస్పద వ్యాఖ్యలతో తెగదెంపులు చేసుకోవాలనే ఉబలాటం
- ప్రొద్దుటూరు టీడీపీ టికెట్‌పై పెట్టుకున్న ఆశే కారణం

సాక్షి ప్రతినిధి, కడప : పేరుకు కాషాయ కండువా కప్పుకున్నా.. మనసు మాత్రం పచ్చ పార్టీ గురించే ఆలోచిస్తుంది. చంద్రబాబుకు జై కొట్టే అతి కొద్దిమంది బీజేపీ నేతల్లో ముందు వరుసలో మాజీ ఎమ్మెల్యే దేవగుడి ఆదినారాయణరెడ్డి నిలుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ విస్తరించాలనే ఉద్దేశం కంటే టీడీపీ బలపడాలనే లక్ష్యం ఆయనలో బలంగా దాగి ఉంది. అందుకు అనుగుణంగానే రాజకీయ సమాలోచనలు ఉంటున్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. తాజాగా బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తాయని పొత్తులపై ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ అధిష్టానం సీరియస్ అయినట్లు తెలుస్తోంది. పార్టీ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం.

ఒకవైపు తాము జనసేనతో మాత్రమే పొత్తులో ఉన్నామని, టీడీపీతో కలిసి వెళ్లేది లేదని బీజేపీ అగ్రనేతలు చెబుతున్నారు. బీజేపీలోని చంద్రబాబు వర్గం నేతలు మాత్రం టీడీపీతో కలవడానికి అత్యధికంగా ఇష్టపడుతున్నారు. అడపాదడపా అదే విషయాన్ని తెరపైకి తెస్తూ తెలుగుదేశం పార్టీని రక్షించేందుకు తెరవెనుక సంకల్పం పుచ్చుకున్నారు. అలాంటి వారిలో జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, మాజీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ముందు వరుసలో నిలుస్తున్నారు. నిత్యం బీజేపీ భజన కంటే చంద్రబాబు భజనే పరిపాటిగా పెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ పటిష్టత ఎలా ఉన్నా, టీడీపీ బలపడాలనే తపన మెండుగా ఉండడమే అందుకు ప్రధాన కారణంగా రాజకీయ పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

కొరవడిన చిత్తశుద్ధి!

2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో ఘోర పరాజయం పాలైంది. టీడీపీ నుంచి కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆదినారాయణరెడ్డి సైతం భారీ ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. తెలుగుదేశం పార్టీ అధికారం కోల్పోయిన వెంటనే మాజీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాజ్యసభ సభ్యుడు సిఎం రమేష్ సైతం అదే బాట పట్టారు. అందుకు ప్రధాన కారణం కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడమే. అధికారం లేకపోతే రాజకీయ మనుగడ కష్టసాధ్యమనే భావనే వారిని బీజేపీలో చేరేలా చేసింది. వైఎస్సార్‌సీపీ జమ్మలమడుగు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆదినారాయణరెడ్డి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకునే క్రమంలో కుటుంబం యావత్తు ఆ పార్టీలో చేరారు. కాగా బీజేపీలో కేవలం ఆదినారాయణరెడ్డి మాత్రమే చేరి, కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీలో అలాగే కొనసాగేలా జాగ్రత్త పడ్డారు. ఇదే వైఖరిని రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ కూడా అవలంబించారు. ఎంపీగా బీజేపీ జాతీయ నేతలతో నిత్యం టచ్‌లో ఉంటూనే కుటుంబాన్ని టీడీపీలో కొనసాగిస్తున్నారు. బీజేపీ పట్ల వీరికి ఉన్న చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా నిలుస్తోంది.

రాబోవు రోజుల్లో మరింత వివాదాస్పదం..

భారతీయ జనతా పార్టీలో క్రమశిక్షణ పాళ్లు అధికం. అరువు తెచ్చుకున్న నాయకుల కారణంగా ఆ పార్టీలో కూడా క్రమశిక్షణ లోపించింది. ఎన్నికల గడువు సమీపించే కొద్ది బీజేపీ నేతల నుంచి వివాదాస్పద వ్యాఖ్యలు అధికం కానున్నాయి. అదే అభిప్రాయాన్ని రాజకీయ విశ్లేషకులు సైతం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు గురించి మాజీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలు కూడా అందులో భాగంగానే భావించాల్సి వస్తోంది. ఇప్పటికే జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే ఆది సోదరుడి కుమారుడు భూపేష్‌రెడ్డి కొనసాగుతున్నారు. టీడీపీ టికెట్ ఆశిస్తున్నారు. అక్కడ కుటుంబాన్ని అలాగే కొనసాగించి, ప్రొద్దుటూరు టీడీపీ టికెట్ కేటాయించాలని తెరవెనుక మంత్రాంగాన్ని మాజీ ఎమ్మెల్యే ఆది నడుపుతున్నట్లు సమాచారం. ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గం తమ స్వగ్రామం దేవగుడికి సమీపంలోనే ఉండడం, ప్రొద్దుటూరు పట్టణం, రూరల్, రాజుపాళెం మండలాలు మాత్రమే విస్తరించి ఉండడం, పలువురితో ప్రత్యక్ష సంబంధాల దృష్ట్యా ఆ సీటును ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమేరకే బీజేపీ నాయకత్వంతో నిమిత్తం లేకుండా వివాదాస్పద నిర్ణయాలు, అభిప్రాయాలు తెరపైకి తెస్తున్నారు. రాబోవు రోజుల్లో మరింతగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం, కుదిరితే టీడీపీ, జనసేన, బీజేపీల పొత్తు.. లేదంటే బీజేపీతో తెగదెంపులు చేసుకోవడమే ఆదినారాయణరెడ్డి అసలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఆర్టీసీకి పూర్వ వైభవం తీసుకొస్తాం



ఎలక్ట్రిక్ బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

- ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి
- ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభించిన ఆర్టీసీ చైర్మన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ఆర్టీసీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం కడప ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న గ్యారేజీ ప్రాంతంలో 12 ఎలక్ట్రిక్ బస్సులను చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశ పెడుతోందన్నారు. అందులో భాగంగా ఏపీఎస్ ఆర్టీసీ అలిపిరి డిపోకు 100 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించిందన్నారు.వీటిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెప్టెంబరు 27వ తేదీన తిరుమల–తిరుపతి మధ్య ప్రారంభించారన్నారు. తిరుమల–రేణిగుంట మధ్య 14 బస్సులు, తిరుపతి–మదనపల్లె 12, తిరుపతి–నెల్లూరు 12, తిరుపతి–కడప మధ్య 12 ఎలక్ట్రికల్ బస్సులను ప్రారంభించారన్నారు. త్వరలో మదనపల్లె–నెల్లూరు మధ్య బస్సులను కూడా ప్రారంభించనున్నట్లు చెప్పారు.కాలుష్య నివారణ, మెరుగైన ప్రయాణ సౌకర్యమే లక్ష్యంగా ఈ బస్సులు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ బస్సులు తిరుపతి నుంచి కడపకు 36 సింగిల్స్ తిరుగుతాయన్నారు. తిరుపతి నుంచి కడపకు పెద్దలకు రూ. 340, పిల్లలకు రూ. 260 ఛార్జీగా నిర్ణయించామన్నారు. ఉదయం 4.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఈ బస్సులు రాకపోకలు సాగిస్తాయన్నారు. వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను నడపనున్నామని, 1570 డీజిల్ బస్సులను కొనుగోలు చేయనున్నామన్నారు. 200 బస్సులను డీజిల్ నుంచి ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు కృషి జరుగుతోందన్నారు. ఇప్పటివరకు కొత్తగా 3700 బస్సులను తీసుకున్నామని వివరించారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 8500 ఆర్టీసీ బస్సులు తిరుగుతున్నాయన్నారు. కడపలో గ్యారేజీని రూ. 13 కోట్లతో నిర్మిస్తున్నామని, రెండు, మూడు నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కడప బస్టాండును అధునాతనంగా నిర్మించేందుకు ముఖ్యమంత్రి అనుమతుల కోసం వేచి చూస్తున్నామన్నారు. ప్రజలకు సరైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రాష్ట్రంలోని అన్ని డిపోల్లో త్వరలో ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో కడప జోన్ ఈడీ గోపీనాథ్‌రెడ్డి, తిరుపతి, కడప ఆర్ఎంలు చెంగల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, హెవీ ట్రాన్స్ ప్రైవేటు లిమిటెడ్ జీఎం సందీప్, డిప్యూటీ సీఎంఈలు పి.లక్ష్మీభాస్కర్, ఇబ్రహీం, కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు, అలిపిరి డిపో మేనేజర్ హరిబాబు, ఏటీఎం జనార్ధన్, సీఐలు గోవర్ధన్‌రెడ్డి, కన్యాకుమారి, శ్రీలత, మహేశ్వర్‌రెడ్డి, యూనియన్ నాయకులు బాబా ఫక్రుద్దీన్, పురుషోత్తం, సగినాల శ్రీనివాసులు, ఏఆర్ మూర్తి, కేకే కుమార్ పాల్గొన్నారు.

• ఘనంగా మేడే



ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను కార్మికలోకం సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకుంది. పలు కార్మికసంఘాల నాయకులు జెండాలు ఆవిష్కరించారు. కడప నగరంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్ నుంచి పాత మున్సిపల్ కార్యాలయం వరకు నాయకులు ర్యాలీ నిర్వహించారు. – కడప వైఎస్సార్‌సర్కిల్

తంచన్‌గా.. పింఛన్

- జిల్లాలో 2,53,719 మందికి రూ 70.01 కోట్లు పంపిణీ
- వానొస్తున్నా తెల్లవారుజామునే కదిలిన వలంటీర్లు



కడప రూరల్ : వానొచ్చినా..వరదొచ్చినా..ఏదైనా సెలవొచ్చినా సరే ప్రతి నెలా ఒకటవ తేదీన తంచన్‌గా 'వైఎస్సార్ పింఛన్ కానుక' వస్తుంది పండుటాకుల్లో సంతోషాలను తెస్తుంది. జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు వర్షాలు పడుతున్నాయి. అయినప్పటికీ వలంటీర్లు ఆగలేదు. అవ్వాతాల ఇంటికి వెళ్లి తలుపు తట్టి పింఛన్ నగదును అందజేశారు. వానొస్తుంది కదా కాస్త ఆలస్యంగా పింఛన్ వస్తుందనుకున్న వారు వలంటీర్‌ను చూడగానే పింఛన్‌ను పొందే వారంతా చిరునవ్వులు చిందించారు. ఏ కాలమైనా సరే..పరిస్థితులు ఏ విధంగా ఉన్న కూడా ఒకటవ తేదీనే పింఛన్‌ను పంపిణీ చేయడం పట్ల వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 2,53,719 పింఛన్‌లకు గాను రూ 70,01,59,750 పంపిణీకి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా శాఖలు చర్యలు చేపట్టాయి.

వానొస్తున్నా పొద్దున్నే పింఛన్ వచ్చింది...



ఈమె పేరు రంగమ్మ. కడపలోని ఎస్వీ డిగ్రీ కాలేజీ ప్రాంతంలో నివసిస్తోంది. ఆ ప్రాంత వలంటీర్ సరోజ వెళ్లి పింఛన్ నగదును ఇచ్చింది.వర్షం వస్తున్నా పొద్దున్నే పింఛన్ నగదు అందిందని, సంతోషంగా ఉందని తెలిపింది.

నా లాంటి వారికి అండగా ప్రభుత్వం



ఈమె పేరు మునీశ్వరమ్మ. ఆ ఏరియా వలంటీర్ అరవింద్ వెళ్లి ఒంటరి మహిళ పింఛన్ నగదును అందజేశారు. ఆమె ఆనందం వ్యక్తం చేసింది. నా లాంటి వారికి ఎందరికో ఈ ప్రభుత్వం అండగా నిలిచింది.జగనన్న మేలును మరువలేమని చెప్పింది.

జగనయ్య మేలు మరువలేం...

ఇతని పేరు సాహెబ్‌పీర్. కడప నగరం నాగరాజుపేటకు చెందిన వారు. ఆ ప్రాంతానికి చెందిన వలంటీర్ మెహరున్నీసా ఉదయాన్నే వెళ్లి వృద్ధాప్య పింఛన్ ఇచ్చింది. జోరు వానలోనూ ఇంటి తలుపు తట్టిన పింఛన్ డబ్బులు చూసి సాహెబ్‌పీర్ ఆనందపడ్డాడు. మా జగనయ్య మేలును మరువలేమని హర్షం వ్యక్తం చేశాడు.

అకాల వర్షం.. అపారనష్టం

- గాలులు, వర్షంతో 1360 హెక్టార్లలో దెబ్బతిన్న వ్యవసాయ పంటలు
- 66.40 హెక్టార్లలో ధ్వంసమైన ఉద్యాన పంటలు



బ్రహ్మంగారి మఠం మండలం ముడమాలలో దెబ్బతిన్న అరటిపంట

కడప అగ్రికల్చర్ : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యం వల్ల వర్షార్పణం అవుతుండటంతో అన్నదాతలు నష్టపోతున్నారు.జిల్లావ్యాప్తంగా సోమవారం తెల్లవారుజాము 3.30 గంటల నుంచి ఉదయం వరకు కురిసిన అకాల వర్షంతో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. దీంతోపాటు రబీలోసాగు చేసిన వరి పంటలను ఇటీవల చాలామంది రైతులు కోత కోసి ధాన్యాన్ని కళ్లాలు, రోడ్లపై ఆరబెట్టారు. ఉన్నట్టుండి వర్షం రావడంతో వరిధాన్యం తడిసిముద్దయింది.జిల్లాలోని పలు మండలాల్లో అరటి, ఉల్లి పంటలు దెబ్బతిన్నాయి. అరటిచెట్లు నేలకూలాయి. వ్యవసాయ పంటలకు సంబంధించి వరి, వేరుశనగ, పెసలు, మినుములు, కొర్ర, మొక్కజొన్న, నువ్వుల పంటలు కూడా దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

• జిల్లాలోని సీకేదిన్నె, వేంపల్లె, ముద్దనూరు, ఒంటిమిట్ట, కాశినాయన, పోరుమామిళ్ల మండలాల పరిధిలో 137 మంది రైతులకు చెందిన అరటి, ఉల్లి పంటలు 66.40 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో సీకేదిన్నె మండలంలో 20 మంది రైతులకు సంబంధించి 12 హెక్టార్లలో, వెంపల్లిలో ఒక రైతుకు చెందిన 40 సెంట్లలో, ఒంటిమిట్ట మండలంలో ఐదుగురు రైతులకు సంబంధించి 4 హెక్టార్లలో, కాశినాయన మండలంలో 27 మందికి చెందిన 22 హెక్టార్లలో, పోరుమామిళ్ల మండలంలో ఇద్దరు రైతులకు చెందిన రెండు హెక్టార్లలో అరటి పంటలు దెబ్బతిన్నాయి.ముద్దనూరు మండలంలో 82 మంది రైతులకు చెందిన 26 హెక్టార్లలో ఉల్లిపంట దెబ్బతిందని ఉద్యానశాఖ అధికారులు అంచానాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు.

• 76 గ్రామాల్లో 1360 హెక్టార్లలో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లింది. ఖాజీపేట, దువ్వూరు, చాపాడు, మైదుకూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, బి.కోడూరు, కాశినాయన మండలాల పరిధిలో వరి, వేరుశగన, పెసర, మినుము, కొర్ర, మొక్కజొన్న, నూగుపంటలు దెబ్బతిన్నాయి. ఇందులో వరికి సంబంధించి 43 గ్రామాల్లో 1075 హెక్టార్లలో, వేరుశనగ నాలుగు హెక్టార్లలో, పెసర ఒక గ్రామంలో 40 హెక్టార్లలో, మినుము ఒక గ్రామంలో 8 హెక్టార్లలో, కొర్రపంట 8 గ్రామాల్లో 92 హెక్టార్లలో, మొక్కజొన్న ఒక గ్రామంలో 6 హెక్టార్లలో, నువ్వుపంట 17 గ్రామాల్లో 135 హెక్టార్లలో దెబ్బతిన్నాయి.

పంటల పరిశీలన

వర్షం, గాలుల దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు పరిశీలించారు. ఖాజీపేట మండలంలో వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని మండల వ్యవసాయ అధికారి నాగార్జునతో కలిసి పరిశీలించి రైతులతో చర్చించారు. తడిసిన ధాన్యంపై కొద్దిగా ఉప్పుద్రావణాన్ని చల్లి బాగా ఆరబెట్టాలని సూచించారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు..

మండలం	కురిసిన వర్షం(మిల్లీమీటర్లలో)	మండలం	కురిసిన వర్షం(మిల్లీమీటర్లలో)
ప్రొద్దుటూరు	102.0	తొండూరు	32.4
చెన్నూరు	87.2	సింహాద్రిపురం	32.4
కమలాపురం	58.4	బి.కోడూరు	32.2
దువ్వూరు	58.4	ఎర్రగుంట్ల	31.8
ముద్దనూరు	57.2	కలసపాడు	30.4
పులివెందుల	53.0	కాశినాయన	28.2
వేముల	50.6	పోరుమామిళ్ల	27.2
వేంపల్లె	50.0	చాపాడు	25.8
పెద్దముడియం	48.6	సిద్దవటం	25.8
ఖాజీపేట	47.6	కొండాపురం	24.6
వీఎన్‌పల్లె	46.2	లింగాల	21.8
చక్రాయపేట	45.6	పెండ్లిమర్రి	15.4
జమ్మలమడుగు	45.2	సీకేదిన్నె	15.2
బి.మఠం	36.6	బద్వేల్	14.8
మైలవరం	35.6	అట్లూరు	11.8
మైదుకూరు	34.2	గోపవరం	9.2
వల్లూరు	32.4	ఒంటిమిట్ట	8.4

స్పందన అర్జీలు త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ విజయరామరాజు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ విజయరామరాజు అన్నిశాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల వినతులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులో పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్, ఉన్నతాధికారులు అర్జీలను పరిశీలించి పరిష్కార నిమిత్తం సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న హరినాథరెడ్డి

కడప అగ్రికల్చర్ : రైతులకు సంబంధించిన బిందు, తుంపర సేద్య పరికరాలను సకాలంలో ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటి సాగు పథకం రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ సీబీ హరినాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడపలోని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ జిల్లా కార్యాలయంలో పీడీ రవీంద్రనాథరెడ్డి ఆధ్వర్యలో సిబ్బంది, కంపెనీ ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు 8 వేల హెక్టార్లకు బిందు, తుంపర సేద్య పరికరాలు ఇవ్వాలని నిర్ణయిచగా 9982 హెక్టార్లలో లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు చెప్పారు. ఇందులో ఇప్పటికే 8235 హెక్టార్లకు పరికరాలను కూడా అందించనట్లు తెలిపారు. అలాగే 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు 10,500 హెక్టార్లలో సూక్ష్మసేద్యాన్ని లక్ష్యంగా నిర్దేశించారన్నారు. కొత్త రైతులను గుర్తించి రైతు భరోసా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రొత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి, ఉద్యానశాఖ జిల్లా అధికారి మేఖేల్‌రాజీవ్, ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి, యంఐ ఇంజనీర్లు, యంఐడిసిలు, జిల్లా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చైన్ స్నాచింగ్

సింహాద్రిపురం : మండల పరిధిలోని బి.చెర్లోపల్లె గ్రామ సమీపాన సోమవారం గుర్తు తెలియని వ్యక్తి ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. లింగాల మండలం బోనాలకు చెందిన పుష్పవతి అనే మహిళ తోట వద్దకు ఒంటరిగా వెళుతున్న సమయంలో స్కూటీపై గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలో బంగారు గొలుసు లాక్కొని చెర్లోపల్లె హమ్మకుంట్ల మీదుగా పారిపోయాడు. ఆమె కేకలు వేయడంతో కొందరు వెంబడించినా ఫలితం లేకపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

గ్యాస్ లారీ ఢీకొని డ్రైవర్ దుర్మరణం


మృతి చెందిన బసవరాజు

ఎర్రగుంట్ల : మండల పరిధి చిలంకూరు గ్రామం సమీపంలోని ఐసీఎల్ ఫ్యాక్టరీ వద్ద గ్యాస్ లారీ ఢీకొని బసవరాజు(27) అనే మరో లారీ డ్రైవర్ దుర్మరణం చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎర్రగుంట్ల పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కర్ణాటక రాష్ట్రంలోని బాగల్ కోర్ట్ జిల్లాలోని నందుడియం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. చిలంకూరు గ్రామ సమీపంలోకి రాగానే లారీ టైర్ పంచర్ కావడంతో వేయించడం కోసం బసవరాజు కిందికి దిగి వస్తున్నాడు. ఈ సమయంలో అనంతపురం వైపు నుంచి కడప వైపు గ్యాస్ లోడ్‌తో వస్తున్న లారీ వేగంగా వచ్చి వెనక నుంచి బసవరాజు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బసవరాజును 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బసవరాజు చనిపోయాడు.

నకిలీ ఇన్సూరెన్స్ కేసులో ఒకరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : నకిలీ ఇన్సూరెన్స్ కంపెనీల పేరుతో సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న కాల్ సెంటర్ ఏజెంట్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గాజియాబాద్‌లోని వసుంధర ప్రాంతానికి చెందిన మేహ్కాన్ చౌహాన్‌ను కడప టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి మానిటర్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. ఈ సంఘటన వివరాలను కడపలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమ్మవారిశాల వీధిలో నివాసం వుంటూ బంగారుపని చేసుకుంటున్న గౌతంపాల్ అనే వ్యక్తికి రెండేళ్ల క్రితం జుహీ తన్వర్ పేరుగల గుర్తు తెలియని మహిళ ఒక కాల్ సెంటర్‌లో పని చేస్తూ అనురాధ అనే పేరుతో పరిచయం చేసుకుని ఇన్సూరెన్స్ మంచి రిటర్న్స్ వచ్చేవి వున్నాయనీ మాయమాటలు చెప్పి ఇన్సూరెన్స్ పాలసీ చేయించింది. ఏటీఎం కార్డు వివరాలను వాట్సాప్ ద్వారా తెప్పించుకుని ఆయన, అతని భార్య పేరు మీద మొత్తం 4 పాలసీలు చేయించారు. ఈ పాలసీలకు గాను రూ.3,87,000లను డబ్బులను కట్టారు. తరువాత వ్యక్తిగత డేటా, నిందితుల కాల్ సెంటర్‌లో పని చేసే వారికి చేర వేసి వారి ద్వారా మరలా గౌతంపాల్‌కు ఇన్సూరెన్స్ ఆఫర్స్ వచ్చాయని మభ్యపెట్టారు. ఆయన ద్వారా ఇన్సూరెన్స్ చేయించుటకు కొందరిని ఒప్పించి పెద్ద మొత్తంలో దాదాపు రూ.20 లక్షల వరకు వారి నకిలీ బ్యాంక్ అకౌంట్స్‌కు జమ చేయించుకున్నారు. వీరిని వెనుక వుండి నడిపించిన మేహ్కాన్ చౌహాన్ అనే వ్యక్తి ప్రజలకు సంబంధించిన పర్సనల్ డేటాను చోరీ చేసి ఒక నకిలీ కాల్ సెంటర్‌ను నడుపుతూ ఈ విధంగా నకిలీ పాలసీల వ్యవహారాన్ని చేశాడు. సుమారు రూ. 25 లక్షలు వరకు నకిలీ పాలసీలు గౌతంపాల్‌తో చేయించి ఏడాది తరువాత పెద్ద మొత్తంలో వస్తుందనీ చెప్పిన వారు, ఆ పాలసీల మెచ్యూరిటీ సమయానికి పదేపదే వారికి ఫోన్‌లు చేసినా ఫలితం లేకపోయింది. తన చేత నకిలీ పాలసీలను చేయించి మోసం చేసినట్లుగా గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ఈ సంఘటనతో కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ లో కేసును ఏప్రిల్ 3న క్రైం నంబర్ 125/2023 కింద కేసు నమోదు చేశారు.

నేరపరిశోధన విధానం

ఈ కేసును జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని, కేసును ఛేదించేందుకు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్ పర్యవేక్షణలో కడప టూటౌన్ పోలీసులు రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసుకున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా ఫిర్యాది డబ్బు చెల్లించినటువంటి బ్యాంకు ఖాతాలు, ఫోన్‌కాల్స్ ఆధారంగా నిందితులు ఉపయోగించిన అకౌంటు వివరాలను సేకరించి, వాటి ద్వారా కేసు విచారణ చేశారు. నకిలీ పాలసీల ద్వారా మోసం చేస్తున్న ప్రధాన నిందితుడు మేష్కిన్ చౌహాన్‌ను కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం ఉదయం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి మానిటర్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ నకిలీ పాలసీల వ్యవహారంలో మరికొంతమంది పాత్ర వుందనీ ప్రస్తుతం అరెస్టయిన నిందితుడు పోలీసులకు తెలియజేశాడు. వారి కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరిపై దేశ వ్యాప్తంగా ఈ విధంగా నకిలీ పాలసీలు చేసినట్లు కాల్ డేటా ద్వారా తెలుసుకున్నామనీ, లోతుగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం, కడప సైబర్ క్రైమ్ సీఐ శ్రీధర్‌నాయుడు, టూటౌన్ ఎస్ఐ వై.జయరాములు, సైబర్ క్రైమ్ ఎస్ఐ మధుమల్లేశ్వర్ రెడ్డి, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

గ్రామాభివృద్ధే ముఖ్యమంత్రి ధ్యేయం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


భూమయ్యగారిపల్లెలో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేముల : రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని భూమయ్యగారిపల్లె గ్రామంలో ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకట బయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, పీసీబీ రాష్ట్ర డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డిలతో కలిసి ఎంపీ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం కల్యాణ మండపంలో గ్రామస్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే సీఎం జగనన్న ఉద్దేశమన్నారు. మౌళిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నారన్నారు. నిరుపేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. గ్రామస్థాయి నుంచే అభివృద్ధి జరగాలన్నదే లక్ష్యంగా చేసుకుని ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారన్నారు. భూమయ్యగారిపల్లెలో అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేశారని జెడ్పీటీసీ బయపురెడ్డిని అభినందించారు. గ్రామంలో నిర్మించిన కల్యాణ సమీప గ్రామవాసులకు అనువుగా ఉందన్నారు. ఇక్కడే అన్ని వివాహ శుభ కార్యాలు చేసుకునేలా రూ.3.24కోట్లతో నిర్మించారన్నారు. అనంతరం అభివృద్ధి పనులను పూర్తి చేసిన కాంట్రాక్టర్ మనోహర్‌రెడ్డిని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డి, సర్పంచ్‌లు వేమయ్య, ఎంపీటీసీ మల్‌రెడ్డి, పీఆర్ ఈఈ ఓబుళరెడ్డి, డీఈలు రవిచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఏఈ అబ్దుల్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శివారెడ్డి, ఏడీ అశోక్‌రెడ్డి, హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి, ఏఓ చెన్నారెడ్డిలతోపాటు మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాది కార్మిక పక్షపాతి ప్రభుత్వం

కమలాపురం ఎమ్మెల్యే
పి. రవీంద్రనాథరెడ్డి


వైఎస్సార్‌టీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్మికుల పక్షపాతిగా పనిచేస్తోందని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మే డే సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం. జాషువా ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది త్యాగాల ఫలితంగా కార్మికులకు 8 గంటల పనిదినాలు లభించాయన్నారు. అందుకు గుర్తుగా మే డే జరుపుకుంటున్నామన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత చేతి వృత్తుల వారికి, ఆటో డ్రైవర్లకు, రజకులు, టైలర్లకు ప్రతి ఏటా ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా, తోపుడు బండ్లు, బుట్ట వ్యాపారస్తులకు జగనన్న తోడు కింద ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. కార్మికులకు మేలు జరగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలన్నారు. జగనన్నకు మళ్లీ సీఎం చేయడానికి కార్మికులంతా కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్‌బోర్డు ఛైర్మెన్ పులి సునీల్ కుమార్, సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, వైఎస్సార్‌టీయూసీ నగర అధ్యక్షుడు నాగరాజు, మేసా ప్రసాద్, పార్టీ నాయకులు బంగారు నాగయ్య, సీహెచ్ వినోద్, త్యాగరాజు, ఆర్‌పీ రమణ, సుబ్బారెడ్డి, రత్నకుమారి, టీపీ వెంకట సుబ్బమ్మ, ఉమామహేశ్వరి, అధిక సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

బీటెక్ రవి వీధి రౌడీలా ప్రవర్తించడం తగదు

చక్రాయపేట: తనకు ఏమాత్రం సంబంధం లేకపోయినా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకొనే వారి వెంచర్ల వద్ద వీరంగం సృష్టించి వీధి రౌడీలా ప్రవర్తించడం టీడీపీ నేత బీటెక్ రవికి తగదని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. ఆదివారం బీటెక్ రవి వందలాది మంది తన అనుచరులతో వచ్చి నాగులగుట్టపల్లె వద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారుల వెంచర్‌ను దున్నేసిన సంఘటనపై సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ అతనికి ఏమాత్రం సంబంధం లేని విషయంలో తల దూర్చి ప్రశాంతంగా ఉన్న గ్రామంలో కక్షలు రేకెత్తిస్తున్నాడని విమర్శించారు. ఇలాంటి విషయాల్లో ఏవైనా ఆధారాలు ఉంటే పరిష్కరించడానికి పోలీసు, రెవెన్యూ శాఖలతో పాటు న్యాయస్థానాలు ఉన్నాయనే విషయం గుర్తించాలని చెప్పారు. పులివెందుల నియోజక వర్గ సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి పక్షంలోనే ఇలా బెదిరింపులకు దిగితే ఇక అధికారంలో ఉంటే ఎవరినీ బతకనిచ్చేలా లేరన్నారు. సమావేశంలో ఎంపీపీ మాధవీబాలకృష్ణ, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, మండల యూత్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు రామాంజులరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వేదమూర్తి, గఫూర్, సింగిల్ విండో అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

చింతకొమ్మదిన్నె: కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని మద్దిమడుగు వద్ద టిప్పర్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొన్నట్లు సికెదిన్నె ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు.. సోమవారం కడప వైపు నుంచి రాయచోటి వైపు వెళుతున్న టిప్పర్‌ను రాయచోటి నుంచి కడపకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీకొందన్నారు.

ఈ ప్రమాదంలో గువ్వల చెరువుకు చెందిన టిప్పర్ డ్రైవర్ శివ తీవ్ర గాయాలపాలవ్వగా ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసులుతోపాటు బస్సులో ప్రయాణిస్తున్న షాజీదా, నరేష్‌బాబు, సిరాజున్నీషా, అష్రఫ్ ఉన్నీషాలు గాయ పడినట్లు తెలిపారు. రోడ్డుకు అడ్డంగా వాహనాలను తొలగించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

'అనంత'పై చిత్తూరు విజయం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 పురుషుల వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో సోమవారం చిత్తూరు జట్టు విజయం సాధించింది. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 43.5 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని యోగానంద 47 పరుగులు, రోహిత్‌రోషన్ 39 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు అనిల్ 2, మల్లేశన్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 35 ఓవర్లలోనే 4 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని పి.భవానీప్రసాద్ 95 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈయనకు జతగా ధరణికుమార్‌నాయుడు 32 పరుగులు చేశాడు.

దీంతో చిత్తూరు జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కాగా కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించాల్సిన నెల్లూరు, కడప మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది.

ఆటోను ఢీకొన్న కారు


మృతి చెందిన సయ్యద్ గౌస్‌బాషా

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలో గల బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగిరెడ్డి పెట్రోల్ బంకు వద్ద సోమవారం సాయంత్రం ఆటోను కారు ఢీకొంది. సికెదిన్నె ఎస్ఐ బి.అరుణ్‌రెడ్డి తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని జమాల్‌పల్లెకు చెందిన సయ్యద్ గౌస్‌బాషా (23) అనే వ్యక్తి తన సొంత ఆటోలో కడపకు వెళుతుండగా పెట్రోల్ బంకు వద్దకు రాగానే కడప వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

మదనపల్లె : మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి వెంట తీసుకెళ్లిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ చంద్రమోహన్ చెప్పారు. పట్టణంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు చెందిన ఓ మైనర్ బాలిక(16)ను ఇటీవల అదే ప్రాంతానికి చెందిన లోకేష్ అనే యువకుడు ప్రేమ పేరుతో నమ్మించి బయటకు తీసుకెళ్లాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ పథకాలు కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి


సమావేశానికి హాజరైన కార్మికనాయకులు, అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఉప కార్మిక కమిషనర్ శ్రీకాంత్‌నాయక్, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం మేడేను పురస్కరించుకుని స్థానిక ఐఎంఏ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పెట్టుబడి విధానపు తొలి దశలో పని గంటలకు పరిమితులు ఉండేవి కావన్నారు. రోజుకు 14 నుంచి 24 గంటల వరకు విరామం లేకుండా కార్మికులు పనిచేసేవారన్నారు. పనిగంటల తగ్గింపు కోసం తొలి నుంచి కార్మిక సంఘాలు పోరాడుతూ వచ్చాయని తెలిపారు. అమెరికా నగరంలోని చికాగోలో జరిగిన పోరాట ఫలితంగా కార్మికులకు 8 గంటల పనిదినాలు అమలులోకి వచ్చాయని వారు వివరించారు. కార్మికుల కష్టాన్ని గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్తాఫ్, నగర అధ్యక్షుడు చిట్టి, సెక్రటరీ మల్లికార్జున, కార్మిక నాయకులు రాము, కార్పెంటర్ల సంఘం అధ్యక్షుడు బ్రహ్మయ్య, కార్మిక శాఖ సిబ్బంది శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, పాల్ జాన్సన్, మునిస్వామి, లోకపావని తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో దొంగల హల్‌చల్


బెడ్ రూమ్‌లోని డబుల్ కాట్ అరలను తెరచిన దొంగలు

మైదుకూరు : మైదుకూరు పట్టణంలో దొంగలు హల్‌చల్ చేశారు. ఆదివారం రాత్రి జరిగినట్టుగా భావిస్తున్న ఈ సంఘటనలో షేక్ షాకీర్ హుస్సేన్ అనే వ్యక్తి ఇంటి తలుపులు పగులగొట్టి దొంగలు బంగారు వెండి వస్తువులతో పాటు భారీగా నగదును ఎత్తుకెళ్లారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. షేక్ షాకీర్ హుస్సేన్ స్థానిక కడప రోడ్డులోని మానస కాంప్లెక్స్‌లో క్లినికల్ లేబరేటరీ నిర్వహిస్తున్నారు. నంద్యాల రోడ్డులోని కేసీ కాలువ వద్ద నివాసం ఉంటున్నారు. ఈనెల 28న తన సోదరి సమీహాను దుబాయ్ విమానం ఎక్కించేందుకు షాకీర్ హుస్సేన్ చెన్నైకి వెళ్లారు. అదే సమయంలో తల్లి షహీన్ ప్రొద్దుటూరు ఓ వివాహం కోసం వెళ్లగా భార్య రిహానా సిద్దవటంలోని తన పుట్టింటికి వెళ్లింది. సోమవారం మధ్యాహ్నం పక్కింటిలోని ఓ మహిళ పింఛన్ తీసుకునేందుకు తోడుగా వస్తుందేమోనని షాహీన్‌ను పిలిచేందుకు వెళ్లగా తలుపులు తెరచి ఉండటం గమనించింది. వెంటనే సమాచారాన్ని ఫోన్ ద్వారా తెలియజేసింది. ఆందోళనతో ఆమె ప్రొద్దుటూరు నుంచి ఇంటికి చేరుకొని చూడగా ఇంటిలోని వస్తువులు చిందరబందరగా పడి ఉన్నాయి. బెడ్ రూమ్‌లోని బీరువా, డబుల్‌కాట్ అరలు తెరచి ఉన్నాయి. దొంగతనం జరిగినట్టుగా ఉందని భావించి తన కుమారుడు షాకీర్‌కు, కోడలు రిహానాకు సమాచారం ఇచ్చింది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు క్లూస్ టీం సభ్యులు ఇంటిని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. కాగా బీరువాలో ఉన్న సుమారు 6 తులాల బంగారు వస్తువులు, వెండి వస్తువులతోపాటు రూ.1,50,000 నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు.

తేనెటీగల దాడిలో ముగ్గురికి గాయాలు

మదనపల్లె : తేనెటీగల దాడిలో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. కోళ్లబైలు పంచాయతీ మాదిగగుంత కనుమ గ్రామానికి చెందిన రైతు గోపాల్‌రెడ్డి(50) తన మనవరాళ్లు హేమలత (12), రాణెమ్మ(10)లతో కలిసి బోరుబావి వద్దకు వెళ్లారు. అక్కడ పని చేసుకుంటుండగా అకస్మాత్తుగా వీరిపై తేనెటీగల గుంపు దాడి చేసింది. తేనెటీగల దాడిలో గోపాల్‌రెడ్డి తీవ్రంగా గాయపడగా, మనవరాళ్లు స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 వాహనంలో బాధితుడ్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గోపాల్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కలికిరి : మండల పరిధిలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. టి.సంద్రావారిపల్లి సమీపంలోని పీలేరు–కడప జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి నడిచి వెళుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో వ్యక్తి ముఖం గుర్తుపట్టడానికి వీలులేకుండా పోవడంతో మృతుని ఆచూకీ లభించలేదు. స్థానికుల సమచారం మేరకు మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదం కలికిరి మండల పరిధిలో చోటు చేసుకోవడంతో సోమవారం అందిన సమాచారం మేరకు కలికిరి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వీఆర్ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి సుమారు 60 ఏళ్ల వయస్సు ఉంటుందని, మృతదేహం పీలేరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచినట్లు పోలీసులు తెలిపారు.